

కార్పొరేట్ గాలం

- పదో తరగతి ఫలితాలు రాకముందే ఇంటర్ అడ్మిషన్లు
- ఫీజులో రాయితీ అంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం
- రంగంలోకి దిగిన కళాశాల ఏజెంట్లు
- పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు ముందుచూపు అవసరం

కామారెడ్డి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఏ తల్లిదండ్రులైన తమ జీవితంలో పిల్లలపైన ఎక్కువ ప్రేమ చూపుతూ వారి భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడి పని చేస్తుంటారు. తమ జీవితంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులను తమ పిల్లలు అనుభవించకూడదనే తపన పడుతుంటారు. అందుకోసం వారు సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవడం కోసం అహర్నిశలు వారి గురించే ఆలోచిస్తు వారి జీవితాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు అప్పులు చేసైన సరే మంచి విద్యను అందించాలనే ఆలోచన చేస్తుంటారు. అంతలా ఆలోచించే తల్లిదండ్రులు కొన్ని కార్పొరేట్ కళాశాలలు చేస్తున్న మాయలో పడి విద్యార్థులు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన సందర్భాలు లేకపోలేదు. ప్రస్తుతం అట్లాంటి అంధకారంను మరో మారు ఏర్పరిచేందుకు కార్పొరేట్ కళాశాలలు తమ పనులను కొనసాగిస్తున్నాయి. ఇంకా పదో తరగతి పరీక్షలు ముగియకముందే ఇంటర్ అడ్మిషన్లు కొనసాగిస్తుండడం, విద్యార్థులు పరీక్ష ఫలితాలు వచ్చి ఏ కళాశాల అయితే బాగుంటుందని ఆలోచనలు చేయకముందే ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఏజెంట్లను రంగంలోకి దించి అడ్మిషన్ల ప్రక్రియను మొదలుపెట్టింది. ముందుగా అడ్మిషను తీసుకుంటే ఫీజుల్లో రాయితీ అంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఆశ జూపుతున్నాయి. దీంతో కార్పొరేట్ కళాశాల ఆఫర్లకు తల్లిదండ్రులు అడ్మిషన్లకు అంగీకరిస్తుండడం గమనార్హం. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల డేటాను ఆయా పాఠశాలల నుంచి సేకరించిన కార్పొరేట్ కళాశాల యాజమాన్యం ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం ముందస్తు చర్యలు చేపట్టింది. అడ్మిషన్లు చేయించిన ఏజెంట్లకు కమీషన్లతో పాటు వేతనాలు కూడా చెల్లిస్తుండడంతో డబ్బులకు ఆశపడి ఏజెంట్లు విద్యార్థులను ఆయా కళాశాలల్లో చేర్పించేందుకు కసరత్తును మొదలుపెట్టారు. దీంతో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు లేదంటే వారి తల్లిదండ్రులకు ఏజెంట్లు ఫోన్‌లు చేస్తున్నారు. ఇంటర్‌లో కోరిన బ్రాంచ్‌లో సీటు ఇప్పిస్తామంటూ ఆఫర్లు సైతం ఇస్తున్నారు. పదో తరగతి ఫలితాలు రాకముందే అడ్మిషన్ తీసుకుంటే తక్కువ ఫీజు ఉంటుందని ఆ తర్వాత ఫీజులు పెరుగుతాయని నమ్మబలుకుతున్నారు. ఫలితాలు వచ్చాక తమ పిల్లలను మంచి కళాశాలలో చదివిద్దామనుకునే తల్లిదండ్రులు తర్వాత ఎలాగో కార్పొరేట్ కళాశాలలోనే చేర్పిస్తాం కదా అనే ఉద్దేశ్యంతో అడ్మిషన్ ఆఫర్లకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఇప్పటికే భారీ ఎత్తున విద్యార్థులు చాలా కళాశాలల్లో అడ్మిషన్లు పొందినట్లు సమాచారం. అడ్మిషన్ పొందే వరకు ఏదో ఒక రకంగా కాకాపడుతూ విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్ పొందేలా చేస్తున్నారు.

ఉదయం నుంచి రాత్రి వరకు ఫోన్లమోతే..

ప్రైవేట్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ఫోన్లు రావడంతో ఇదేమి మేతరా బాబు అంటు వాపోతున్నారు. ఎవరైన తల్లిదండ్రులు పరీక్షల ఫలితాలు రాకముందే ఎలా చేర్పించాలంటు ప్రశ్నిస్తే మీ పిల్లలు బాగానే చదువుతారని తమకు సమాచారం ఉందని తప్పకుండా పాస్ అవుతారని చెబుతూ అవసరమైతే పాఠశాలల యాజమాన్యం నుంచి తల్లిదండ్రులకు మాట్లాడిస్తున్నారు. ఫలితాలతో సంబంధం లేకుండా తాము చేర్పించుకుంటామని ఒకవేళ పాస్ కాకపోతే చెల్లించిన డబ్బు తిరిగి ఇస్తామంటూ హామీలు ఇస్తున్నారు. ముందుగానే సీటు రిజర్వ్ చేసుకోకపోతే ఆ తర్వాత కోరిన బ్రాంచ్ దొరకదని బెదరగొడుతున్నారు. తల్లిదండ్రులు తప్పని పరిస్థితిలో అడ్మిషన్లకు అంగీకరిస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుపై ముందు చూపు ఉండాల్సిందే..

పదో తరగతి పరీక్షల సమయంలోనే కార్పొరేట్ కళాశాల ఏజెంట్లు అక్కడక్కడ విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం వేసే ప్రయత్నాలు చేసినప్పటికీ మరో 10 రోజుల్లో ఫలితాలు వస్తాయని ప్రచారం జరగడంతో ఫోన్ల మోత ఎక్కువైంది. వారి మోత భరించలేక ఏ కళాశాల అయితే ఎమవుతుందిలే అని అడ్మిషన్లు జరిపితే చేతులారా తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేసినవారు అవుతారు. ఒక్కసారి కాలేజీల్లో చేరితే తర్వాత ఎవరు పట్టించుకోరు. గత సంవత్సరం సైతం చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కార్పొరేట్ గారడిలో పడి మోసపోయిన సంఘటనలు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం ఏజెంట్లు అడ్మిషన్ చేయించడం ఆ తర్వాత వారు వెళ్లిపోవడం షరా మామూలుగా మారింది. కార్పొరేట్ కళాశాలలో చేర్పించే ముందు విద్యార్థుల అభిప్రాయాలతో పాటు ఆ కళాశాలలో విద్యనాణ్యత, విద్యా బోధన చేస్తున్న వారి అనుభవం, ఆ కళాశాలకు చెందిన సీనియర్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులను అడిగి తెలుసుకోవడంతో పాటు హాస్టల్‌లో ఉంచినట్లయితే వసతులపై ఆరా తీసిన తర్వాతనే అడ్మిషన్ కోసం మొగ్గు చూపాలి. తమ విద్య వ్యాపారం కోసం నిత్యం పుస్తకమే ప్రపంచంగా మార్చే కళాశాలలు కోకొల్లలుగా ఉన్నాయి. అట్లాంటి కళాశాలల్లో చేర్పిస్తే విద్యార్థి తీవ్ర ఒత్తిడికి గురై మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు లేకపోలేదు. అందుకని తొందరపాటు చర్యలతో కార్పొరేట్ కళాశాల మాయలోపడి విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బందులు కలుగకుండా తల్లిదండ్రులు ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.





మద్నూర్ ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను నిలిపివేస్తారా?

- ఆసుపత్రిలో చిన్నచిన్న సమస్యలు పరిష్కరించకుంటే ఎలా?
- వైద్య సిబ్బందిపై డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మీ ఆగ్రహం

మద్నూర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆసుపత్రిని డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మీ పరిశీలించారు. ఈనెల 20న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'కుటుంబ నియంత్రణ ఆపరేషన్ గదిలో విద్యుత్ సమస్య' అనే కథనానికి ఆమె స్పందించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఇటీవల పలు ఫిర్యాదులు వస్తున్నాయని దీనిపై కలెక్టర్ ఆగ్రహంతో ఉన్నట్లు వెల్లడించారు. కుటుంబ నియంత్రణ గదిలో విద్యుత్ లేకపోవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిలిపివేయడం సమంజసమా అంటూ వైద్యులను ప్రశ్నించారు. ఆసుపత్రిలో ఉన్న చిన్నచిన్న సమస్యలు పరిష్కరించకుంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు అందుబాటులో ఉండాలని, ఆసుపత్రికి వచ్చిన రోగులకు సిబ్బంది మర్యాదగా పలకరించాలని సూచించారు. ఆమెతో పాటు వైద్యులు ఆనంద్‌రావు, సిబ్బంది ఉన్నారు.

ప్రతిభ పరీక్షలు విద్యార్థుల్లో భయాన్ని తొలగిస్తాయి

కామారెడ్డి టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రతిభ పరీక్షలు విద్యార్థుల్లో భయాన్ని తొలగిస్తాయని టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంసెట్, నీట్ పరీక్షలకు పోటీ పెరిగిందన్నారు. తీవ్రంగా పెరిగిపోవడం జరిగిందని సరైన ప్రణాళికతో ముందుకు వెళితేనే మంచి కళాశాలల్లో సీటు పొందవచ్చన్నారు. చిన్న వయస్సుల్లోనే లక్షల రూపాయల ప్యాకేజీని ఇంజనీరింగ్ విద్యార్థులు పొందుతున్నారని దాని కోసం సరైన గైడెన్స్ తీసుకుని విద్యార్థులు జీవితాలను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దుకోవాలని అన్నారు. పరీక్షలంటే భయాన్ని వదిలి అనుకూల వాతావరణం పెంపొందించుకుంటే ఉన్నత స్థాయి ర్యాంకులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణితశాస్త్ర అధ్యాపకుడు శ్రీకాంత్, ఎస్ఆర్‌కే ప్రిన్సిపాల్ దత్తాద్రి, కోఆర్డినేటర్ నవీన్, టీఎస్‌ఎస్‌ఎఫ్ నాయకులు అంజల్‌రెడ్డి, జమీల్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నమూనా పరీక్షలను రాస్తున్న విద్యార్థులు

మున్సిపల్ ఆదాయానికి గండి

- తైబజార్ డబ్బులు చెల్లించని కాంట్రాక్టర్‌లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- కౌన్సిలర్ల అండదండలతోనే చెల్లించని వైనం

వివరాలు 7లో..





దోమకొండలో భీమ్‌వాక్ నిర్వహిస్తున్న ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్

దోమకొండలో ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ భీమ్‌వాక్

దోమకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కుల గ్రామం మీదుగా దోమకొండ వరకు ఆదివారం ఉదయం ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ భీమ్‌వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 15 కాన్షీరాం జయంతి నుంచి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వరకు భీమ్‌దీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి భిక్కనూర్ మండలంలోని అంతంపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టి ఉదయం దోమకొండ మండలంలో భీమ్‌వాక్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సుమారు 12 కిలోమీటర్ల దూరం వాక్ నిర్వహించారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్‌కు వెళ్లారు. భీమ్ వాక్ కార్యక్రమంలో చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య, స్వేరోస్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ చిలక బత్తిని వీరయ్య, స్వేరోస్ వైస్ ఛైర్మన్ దేవరగట్టు బాలప్రసాద్, ఖమ్మం స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

ఇందిరమ్మ రాజ్యం తేవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

జుక్కల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇందిరమ్మ రాజ్యం తేవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం జుక్కల్ మండలం బంగారుపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద చేయబడిన గ్రామంలో ఆయన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. నిరుపేదలను అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తీసుకువచ్చారని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో విద్యను అభివృద్ధి చేస్తూ రహదారులు నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. యువకులకు ఉపాధి కల్పించడానికి తెలంగాణ సీఎం ప్రతీ ఒక్కరికి రాజీవ్ యువ వికాసం కింద రుణాలు అందించనున్నారని తెలిపారు. మండలంలో నిర్మాణంలో ఉన్న బీటీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రమేష్ దేశాయ్, సతీష్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగులతో జాగ్రత్త!

- జిల్లాలో పలుచోట్ల పిడుగు ప్రమాదాలు
- లింగంపేటలో ఇటీవల గేదెలు, గొర్రెల మృతి
- ప్రస్తుతం జిల్లాలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు
- అకాల వర్షంలో పిడుగులతో పెద్ద ఎత్తున ప్రమాదాలు
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న నిపుణులు



లింగంపేటలో పిడుగు పాటుకు మృతి చెందిన గేదెలు, మేకలు (ఫైల్)

కామారెడ్డి టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పిడుగుల కారణంగా జిల్లాలో ప్రతీ ఏడాది పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ప్రతీయేట మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు పడుతుండడంతో అటు రైతులు, ఇటు సామాన్య ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కూలీలు, రైతులు, పశువుల కాపర్లు పిడుగుపాటుకు గురవుతున్నారు. చెట్ల కింద కట్టేసిన పశువులు సైతం పిడుగుపాటుతో ప్రమాదానికి గురై మరణిస్తున్నాయి. ప్రస్తుతం పిడుగుల కాలమని ప్రజలు భద్రంగా ఉండాల్సిందేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఈనెల 21న జిల్లాలోని లింగంపేట మండలం పోతాయిపల్లి, లింగంపల్లి గ్రామాల్లో మేతకు వెళ్లిన గేదెలు, మేకలపై పిడుగుపడడంతో రెండు గేదెలు, మూడు మేకలు మృత్యువాత పడ్డాయి. అక్కడే ఉన్న కాపరులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇలా గత రెండు సంవత్సరాల్లో మార్చి, ఏప్రిల్, మేనెలలో అకాల వర్షాలతో పిడుగులు పడి పెద్దఎత్తున ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. నిజాంసాగర్, మాచారెడ్డి, కామారెడ్డి పట్టణంలోని లింగాపూర్, బీబీపేట మండలం జనగామ గ్రామంలో పిడుగులు పడి మనుషులతో పాటు పశువులు మృత్యువాత పడ్డాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు చెట్ల కింద, ఎత్తైన ప్రదేశాల్లో ఉండకుండా అప్రమత్తత పాటించాలని నిపుణులు పేర్కొంటున్నారు.

అసలు పిడుగు అంటే

మేఘాల వద్ద ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడం వల్ల చిన్నచిన్న నీటి బిందువులు ఆవిరి రూపంలో ఉంటాయి. ఇదే సమయంలో విపరీతమైన గాలులు వీచినప్పుడు మంచుకణాలు, నీటి బంధువుల మధ్య రాపిడి ఏర్పడి ఎలక్ట్రిక్‌చార్జ్ ఉత్పన్నమవుతోంది. దీంతో పాజిటివ్, నెగిటివ్ చార్జి ఉన్న కణాలు విడుదల అవుతాయి ఇలా రెండు వేర్వేరు మేఘాలు దగ్గరగా వచ్చినప్పుడు రాపిడి జరుగుతోంది. దీంతో ఆ రెండింటి మధ్య మెరుపు(విద్యుత్), ఉరుము (శబ్దం) ఉత్పన్నమవుతాయి. ఈ సమయంలోనే మేఘంలోని కింది భాగంలో ఉండే నెగిటివ్ చార్జి కణాలు భూ ఉపరితలంపై ఉండే పాజిటివ్ చార్జి కణాల చేత ఆకర్శించబడతాయి. మేఘాల్లో రాపిడికి ఉత్పన్నమైన విద్యుత్ భూమిని చేరుతోంది. దీన్ని మనం పిడుగు అంటాం. ప్రధానంగా ఈ నెగిటివ్ చార్జి కణాలు భూమిని చేరే క్రమంలో ఎత్తయిన ప్రదేశాలు, చెట్లు, కొండలు, మనుషులు, జంతువుల ద్వారా ఆకర్షించబడి భూమిని చేరుతాయి. ఈ చేరే క్రమంలో ఆ కణాలు దేని ద్వారా చేరితే అవి బుగ్గి కావడం చూస్తుంటాం.

పిడుగు పడినప్పుడు 2,900 సెల్సియస్ ఉష్ణోగ్రత ఉత్పన్నం

పిడుగుపాటు విషయంలో ప్రధానంగా పల్లెల్లో అనేక కథలు ప్రచారం ఉన్నాయి. దేవదానవ యుద్ధం కారణంగా ఇలా ఉరుములు, మెరుపులు వస్తాయని మెరుపులు వచ్చే సమయంలో అర్జున, పాల్గుణ అంటే వారు మనల్ని పిడుగుల భారి నుంచి రక్షిస్తారని పెద్దలు చెబుతుంటారు. ఇవి ఏ మాత్రం సహేతుకం కాదని నిపుణులు పేర్కొంటున్నారు. సాధారణంగా సూర్యుని ఉపరితలంపై 5700 సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. కానీ పిడుగు పడినప్పుడు ఉత్పన్నమయ్యే ఉష్ణోగ్రత సూర్యుని ఉపరితల ఉష్ణోగ్రతకు సుమారు 5 రేట్లు అధికంగా 2700 సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. ముఖ్యంగా డిసెంబరు, జనవరి, మార్చి, ఏప్రిల్, మే నెలలో ఈ తరహాలో అకాల వర్షాలు పడడం, వడగండ్లుపడడంతో పాటు పెద్ద ఎత్తున పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. యాసంగి పంటలు కోతకు వచ్చే సమయం కావడంతో పాటు వరి ధాన్యం కుప్పల వద్ద రైతులు సేదతీరడం, ఎండవేడికి పశువులను రక్షించుకునేందుకు చెట్ల కింద కట్టేయడం లాంటివి చేస్తుంటారు. వాతావరణంలో మార్పులు రావడంతో పాటు పెద్ద ఎత్తున గాలులు, ఆకాశంలో మెరుపులు కనిపించినప్పుడు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడంతో పాటు పశువులను సైతం సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పిడుగుపాటు నుంచి బయటపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులు పిడుగులు పడే సమయంలో ఫోన్‌లు మాట్లాడకపోవడమే మంచిది. ఉరుములు, మెరుపులు వేళలో టీవీలు చూడటం ప్రమాదకరం. అంతేకాక స్విచ్‌బోర్డుల నుంచి ప్లగ్‌లు తీసివేయాలి లేదంటే ఎలక్ట్రిక్ వస్తువులు పాడయ్యే ప్రమాదముంటుంది. ఇంటి కిటికీలు, తలుపుల దగ్గర నిలబడి బయటకు చూడటం మంచిది కాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కిందకు వెళ్లకూడదు. ఒకవేళ బయట ఉన్నప్పుడు ఉరుములు, మెరుపులు పడే అవకాశముంటే ఎత్తు తక్కువగా ఉండే ప్రదేశాల్లో కూర్చొని రెండు కాళ్ల మధ్య తల ఉంచి చెవులు, కళ్లు మూసుకుని ఉండాలి. పెంపుడు జంతువులను ఎట్టి పరిస్థితుల్లో బయట వదిలేయకుండా షెడ్లలో ఉంచాలి. ఉరుముల వేళ మన శరీరం జలదరింపునకు గురి కావటం, వెంట్రుకలు నిక్కబొడుచుకోవడం వంటి సంకేతాలు కనిపిస్తాయని ఇలా జరిగితే పిడుగు మీ దగ్గరలో పడుతున్నట్లు అర్థం. అప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలి.

పంట నష్టంపై రైతులకు భరోసా



ధర్పల్లిలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి, మార్చి23(ఆంధ్రజ్యోతి): పంట నష్టంపై రైతులు అధైర్య పడవద్దని నిజామబాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం మండలంలోని మాద్దున్‌తాండా, వాడి, ఒన్నాజీపేట, గుడితాండాలలో ఇటీవల వడగాండ్ల వానకు దెబ్బతిన్న పంటకు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంట నష్టం జరిగిన వెంటనే వ్యవసాయాధికారులకు ఆదేశాలు ఇచ్చామని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలని ఆదేశించామన్నారు. జిల్లాలో ధర్పల్లితో పాటు సిరికొండ, బోదన్ మండలాల్లో వెయ్యి ఎకరాల మేర వరి పంట వడగాండ్ల వానతో నష్టం జరిగిందని ఆయన గుర్తు చేశారు. పంట నష్టంపై సీఎం రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వివరించి నట్టు ఆయన చెప్పారు.ఆయన వెంటమం డల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, ధర్పల్లి సింగిల్‌విండో ఛైర్మన్ మల్లికార్జున్, మాజీసర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, సుబాష్, శ్రీనివాస్, మిట్టపల్లి ప్రవీన్‌రెడ్డి ఉన్నారు.

● ఎమ్మెల్యే ఎదుట మహిళా రైతు కంటతడి

మండలంలోని వాడి గ్రామానికి చెందిన మహిళా రైతు రాజమణి తాను వేసిన ఎకరం పంట వడగండ్ల వానకు పూర్తిగా దెబ్బతిందని. ఈ మహిళ ఎమ్మెల్యే ఎదుట బోరున విలపించారు.

అంకాపూర్‌ను సందర్శించిన నాందేడ్ జిల్లా రైతులు



అంకాపూర్‌లో పసుపును పరిశీలిస్తున్న నాందేడ్ జిల్లా రైతులు

ఆర్మూర్‌రూరల్ మార్చి23(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని ఆదివారం మహరాష్ట్రలోని నాందేడ్ జిల్లా రైతులు సందర్శించారు.ఆత్మకార్యక్రమంలో భాగంగా రైతులు పంటల పరిశీలనకు వచ్చారు.ఈసందర్బంగా వారు గ్రామంలో పంటలను పరిశీలించారు. పసుపు తవ్వే విధానం, ఉడకబెట్టే పద్దతిని, వాటర్ స్టోరేజీ ట్యాంకులు, ఆయిల్‌పాం క్షేత్రాలను, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. అనంతరం గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. అంకాపూర్ గ్రామ రైతులు పంటల సాగులో అవలంబిస్తున్న పద్దతులు, సాధిస్తున్న దిగుబడులు, మార్కెట్ సౌకర్యం, తదితర వివరాలను నాందేడ్ జిల్లా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అనంత్‌రెడ్డి, ఆలూర్ నారాయణరెడ్డి, కెకె.బాజన్న, అధికారులు ఆనంద్, శివప్రకాష్, శివదర్శన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి బోనాల సమర్పణ



బోనాలను తీసుకువెళ్తున్న ముదిరాజ్ సంఘం మహిళలు

ఆర్మూర్‌టౌన్,మార్చి23(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని రాజారాం నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు పెద్ద మ్మతల్లికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా రాజారాం నగర్ కాలనీ నుంచి మహిళలను ఎత్తుకొని డప్పువాయిద్యాలతో ప్ర ధాన వీధులగుండా పెద్దమ్మతల్లికి బయలుదేరి అంకాపూర్‌రోడ్‌లోని పెద్ద మ్మతల్లి విగ్రహానికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈర్ల రవి, ప్రధానకార్యదర్శి సంబాడి కుమార్, ఉపాధ్యక్షుడు జంగిడి బోజన్న, కోశాధికారి జంగిడి సురేష్, గంగాధర్, చిన్న బోజన్న, ముదిరాజ్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో ఉచిత వైద్యశిబిరం



ఉప్లూర్‌లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కమ్మర్‌పల్లిమార్చి 23: (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉప్లూర్ గ్రామంలో ఆదివారం లైఫ్ ఆసుపత్రి ధన్వంతరి విజయయాత్రలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులోభాగంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భా ను రామగిరి క్రిటికల్ కేర్‌అండ్ డయాబెటిస్, డాక్టర్ శ్రీకాంత్‌లోయ డీఎం న్యూరాలజిస్టు (నరాల వైద్యనిపుణులు), డాక్టర్ శ్రీవంతి రెడ్డి అధ్వర్యంలో ఉప్లూర్, నాగాపూర్, రాజరాజ్వేరినగర్ గ్రామాల ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వమించి ఉచిత మందులు అందజేశారు. ఉచిత వైద్యశిబిరంలో సింగిల్ విండో ఛైర్మన్ రేగుంట దేవేందర్, ఉప్లూర్ గ్రామ అభివృద్ది అధ్యక్షుడు సోమ దశరత్, బద్దం రమేష్ రెడ్డి, ఏనెడ్ల మురళి, నందగిరి దయానంద్, శ్రీనివాస్ రెడ్డి, బద్దం చిన్నారెడ్డి,బోనగిరి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ పాలసీ ద్వారా ఎక్స్‌గ్రేషియా అందజేత

ముప్కాల్, మార్చి23(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో గల్ఫ్ దేశాలలో మరణించిన వారికి ఎన్‌ఆర్‌ఐ పాలసీ కింద మంజూరైన రూ.5 లక్షలు మృతుల కుటుంబాలకు అందజేశారు. ఆదివారం బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఈరయ్య, మల్ల య్య, ఇటీవల అనారోగ్యంతో గల్ఫ్‌దేశంలో మరణించారు. ఈ విషయం తెలుసు కున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ వారి కుటుంబసభ్యులకు ఎన్‌ఆర్‌ఐ పాలసీ కింద రూ.5 లక్షల చొప్పు న మంజూరు చేయించారు.

సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలు

రెంజల్,మార్చి23(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల కేంద్రంలో మోతిలాల్ అనే వ్యక్తి ఇంట్లో సిలిండర్ పేలి భార్యాభర్తలిద్దరికి గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం వంట చేసేందుకు సిలిండర్ ఆన్ చేయగా పైపుల నుండి గ్యాస్ లీకేజీ కావడంతో ఒక్కసారిగా పేలిపోవడంతో భార్యాభర్తలిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మోతిలాల్ తన భార్య లతతో ఇంట్లో ఉదయం వంట చేసే సమయంలో సిలిండర్ స్టవ్ ఆన్ చేయగా అప్పటికే పైపు లీకేజీ అవడంతో సిలిండర్ ఆన్ చేయగా ఒక్కసారిగా పేలి మంటలు ఎగసిపడగా స్థానికులు గమనించి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. లతకు కొద్దిగా మోతిలాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్సను అందజేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోతిలాల్

భగత్‌సింగ్ ఆశయాలని కొనసాగించాలి



ఖుద్వాన్‌పూర్‌లో భగత్ సింగ్ వర్థంతి సభలో పాల్గొన్న విద్యార్థులు



భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



మామిడిపల్లిలో..

ఆర్మూర్‌రూరల్, మార్చి23(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ ఆశయాలని యువత కొనసాగించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. ఆదివారం మామిడిపల్లిలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కూతడి ఎల్లయ్య, నాగరాజు, సాయిలు, గంగారాం, గంగాధర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ ప్రజాపంత డివిజన్ కార్యదర్శి డి. కిషన్, పర్ససత్యం, ఎం ముత్తెన్న, ఎం నరేంధర్ , అరవింద్, దుర్గప్రసాద్, శ్రీనివాస్, వినోద్, నరేష్, సిద్దు, బాలక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో

మామిడిపల్లిలో పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యశివాజీ, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి హుసేన్, నాయకులు రాహుల్, గణేష్, సాయి, పవన్, విశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నంది పేట: మండలంలో ఖుద్వాన్‌పూర్ గ్రామంలో ఉన్న ఎస్సీ, బీసీ హాస్టల్‌లో ఆదివారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ 94వ వర్ధంతి సభను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు కె గంగాధర్ బీసీ, ఎస్సీ ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వర్ని: స్వాతంత్ర సమరయోధుడు విప్లవకారుడు భగత్ సింగ్ బతికుంటే దేశం మరోలా ఉండేదని, ఆయన జీవితం పోరాట పటిమ నేటి యువతు ఆదర్శనీయమని సీపీఎం నాయకులు నెల్లూరి లక్ష్మణ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాయిబాబు,సురేష్, లింగం, మారయ్య పాల్గొన్నారు.

బీర్కూర్: స్వాతంత్ర్య సమర యోధులు భగత్ సింగ్, రాజ్ గురుల స్ఫూర్తితో యువకులు దశ్ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని భగత్‌సింగ్ యువజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్ యువజన సంఘం నాయకులు రాహుల్, రవి, హర్ష, సంజయ్ ఉన్నారు.

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ,పీడీఎస్‌యూ,విద్యార్థిసేన, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బానిస సంకెళ్ల నుండి విముక్తి చేయడానికి అతి చిన్న వయస్సులోనే పోరాటాలు చేసి యావత్తు భారతజాతికి స్ఫూర్తిని నింపిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఈకార్యక్రమంలోపీడీఎస్‌యూ నాయకులు సురేష్, రాకేష్,శేఖర్, శ్రీకాంత్,శివాజీ, అరవింద్, ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, రాహుల్, నితిన్, శ్రీకాంత్,నవీన్, జ్ఞానేశ్వర్, విద్యార్థిసేన నాయకులు సురేష్,నాగరాజు, గౌరవ్,కల్యాణ్,జాదవ్, శ్రీకాంత్,వంశీ,ఏఐఎస్ఎఫ్ నాయకులు శివప్రసాద్, సంపత్, టరాజు,సాయి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, మల్లేష్, సూరిబాబు, ప్రవీణ్ కుమార్, రాజేశ్వర్, జనార్ధన్, రమేష్, మోహన్, ఫకీరా, హర్నామ్‌సింగ్ తదితరులున్నారు.

వేల్పూర్: కామ్రేడ్ షహీద్ భగత్‌షింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో యువతరం ఈ దేశాన్ని మార్చాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు సురేష్, కిషన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుల గ్రామపంచాయతీ కార్మికులు రాజన్న, సోం, గంగారాం, ఉన్నారు.

● పచ్చలనడ్కుడలో భగత్‌సింగ్ వర్ధంతి

వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టక్కరి గంగా ధర్, చక్రపాణి, కుర్మ రాజేందర్, ఎంగంటి నెహ్రూ, సాయిరాం, మండల బోజన్న, నర్సయ్య, గట్టవుతాల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: దేశ స్వాతంత్ర్య కోసం అమరత్వం పొందిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుకదేవ్‌లను విద్యార్థులు, యువకులు స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు జి.కిషన్ అన్నారు. ఈకార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లానాయకులు ఎస్.సురేష్, సత్తెమ్మ, గురుకుల పాఠశాల హాస్టల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు నడుం బిగించాలి



మెండోరాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

మెండోర, మార్చి23(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీఒక్కరు నడుం బిగించాలని ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జై బాపు జై భీమ్, జైసంవిదాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకట్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అణగదొక్కుతు మహానీయులను అవమానిస్తున్న ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వమని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవమానించేలా కేంద్రలోని బీజేపీ సర్కార్ ప్రవర్తిస్తుందని అన్నారు. అహింస పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి స్వాతంత్ర్య సిద్ధింపచేసిన మహాత్మాగాంధీతో పాటు ప్రజల స్వేచ్ఛ సమానత్వం కోసం రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌లను బీజేపీ అవమానపరుస్తున్నాదని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలో ఇందుకు నిదర్శనం అన్నారు. మహనీయుల ఆశయాలను కాపాడడంతో పాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జైబాపు, జైబీమ, జైసంవిధాన్ అభియాన్ ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సలీం, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో చలో ఢిల్లీ వాల్ పోస్టర్ల విడుదల

కోటగిరి,మార్చి23(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు విఠల్ గౌడ్ కోరారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం చలో ఢిల్లీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తుందని మండిపడ్డారు. దేశంలో వివిధ కార్మిక సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బోర్డులను ఒకే గూటికి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజు, గంగాధర్, దత్తు పాల్గొన్నారు.

చలో పార్లమెంట్ పోస్టర్ల ఆవిష్కరణ

నవీపేట,మార్చి23(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేడు చేపట్టనున్న చలో పార్లమెంట్ పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కటారి రాములు మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్, దేవేందర్ సింగ్, ఆంజనేయులు, కబీర్ ఖాన్, రాజారాం, అర్జున్ తదితరులున్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

నందిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కంపల్లిలో ఇటీ వల జరిగిన దాడి కేసులో కల్లెడ లక్ష్మణ్ అనే నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై ఎం చిరంజీవి తెలిపారు. మాయాపురం పోశెట్టి ఆయన ఇంటి ముందర ఉన్న రోడ్డు విషయంలో కల్లెడ లక్ష్మణ్‌కు మధ్య వాగ్వివాదం జరిగిందని పోలీసులు చెప్పారు. దీంతో కల్లెడ లక్ష్మణ్, మాయాపురం పోశెట్టిపై కర్రతో దాడి చేయగా తీవ్ర గాయాలైనాయని బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన భార్య మాయాపురం సా యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

నేడు నందిపేటలో తైబజార్ వేలం

నందిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం తైబజార్‌కు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి మహిందర్ తెలిపారు. ఈ నెల 21న తైబజార్‌కు వేలం పాట నిర్వహించగా రూ.8.05 లక్షల వద్ద నిలిచి పోయింది. అలాగే రోజువారి మార్కెట్‌కు వేలం పాట నిర్వహించగా రూ.1.15 లక్షల వద్ద నిలిచిపోయింది. దీంతో గ్రామ పంచాయతీకి అప్‌సెట్ ప్రైజ్ రాకపోవడంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశారు. ఈ వేలం పాటను సోమవారం పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు ఉదయం 10.30గంటలకు నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి డి మహిందర్ చెప్పారు.

కేజీబీవీ విద్యార్థినులకు బ్యాగుల పంపిణీ

నవీపేట,మార్చి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆదివారం పలువురు విద్యార్థినులకు స్కూల్ బ్యాగులతో పాటు కాస్మోటిక్ వస్తువులను పంపిణీ చేశారు.మోకన్‌పల్లికి చెందిన ఎంకేపీ అండ్ గల్ఫ్‌వాట్సప్ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో వీటిని 30మంది నిరుపేద విద్యార్థినులకు అందజేశారు. విద్యార్థినులకు స్కూల్ బ్యాగులు,కాస్మోటిక్ వస్తువులను అందజేసిన ఎంకేపీ అండ్ గల్ఫ్‌వాట్సప్ గ్రూప్ సభ్యులను స్థానికులు అభినందించారు.

నాడు రుణమాఫీ అన్నారు.. నేడు లేదంటున్నారు

● ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయాలి:గోపిడి రాజన్న

మెండోర, మార్చి23(ఆంధ్రజ్యోతి):అధికారం కోసం నాడు రుణమాఫీ అన్నారు నేడు అధికారం దక్క కొందరికే రుణమాఫీ అని నిండు అసెంబ్లీలో అనడం ఎంత వరకు సమంజసమని అన్ని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపిడి రాజన్న ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రంలో రైతులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులు మచ్చర్ల రాజన్న, కొప్పెట దమ్మయి, మిట్టపల్లి శంకర్, మచ్చర్ల కిష్టయ్య, గంగానరం బోజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను విమర్శించడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్ టౌన్, మార్చి23(ఆంధ్రజ్యోతి): పూటకో పార్టీ మారుస్త డబ్బులకు అమ్ముడుపో తున్న వారు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం హాస్యస్పదంగా ఉందని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్, ఎన్సీసెల్ రాష్ట్రకన్వీ నర్ దేగం ప్రమోద్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల్లో డబ్బులు తీసుకొని ప్రచారం చేసిన నాయకుడు ఇప్పటి వరకు నాలుగు పార్టీలు మారిన నాయకుడు మాట్లాడడం సరికాదు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఈపీసీసీ అధికార ప్రతినిధి ఏబీశ్రీనివాస్‌లను విమర్శించడం సరికాదని పార్టీ అధికారంలో లేకున్న 35 ఏళ్లుగా ఏబీశ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో ఉంటు బాధ్యతలు నిర్వహిస్తు ఆర్మూర్ అభివృద్ధికి తోడ్పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోడమీది బాలకిషన్, ప్రవీణ్,షేక్ పాష,ఎస్‌కెబబ్లు, హబీబ్, సల్మాన్, అరుణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పిప్రిలో సీసీరోడ్డు పనుల ప్రారంభం

ఆర్మూర్‌రూరల్ మార్చి23(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో ఆదివారం సీసీరోడ్డు పనులను వీడీసీసభ్యులు ప్రారంభించారు. స్మశాన వాటిక వెళ్లేదారిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మిస్తున్నారు.సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు చిన్నారెడ్డి,నవీన్, బాపురెడ్డి,బీజేపీ నాయకులు కేసీముత్తెన్న, రోహిత్ రెడ్డి, ప్రభాకర్, గందం నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

బోధన్‌రూరల్,మార్చి23(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని మంజీర సరిహద్దు గ్రామాలైన హున్స, మందర్నా గ్రామాల నుండి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకుని బోధన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బోధన్‌రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నియమ, నిబంధనలు అతిక్రమించిఅక్రమంగా ఇసుక రవాణా చేస్తుండడంతో టిప్పర్లను పట్టుకున్నామన్నారు.టిప్పర్లపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లలో అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

బోధన్‌రూరల్,మార్చి23(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన రమేష్(26)అనే వ్యక్తి చెరువులో పడి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం పొలం వైపుకు వెళ్లి పని ముగించుకుని ఇంటికి వస్తుండగా మధ్యలో గ్రామ చెరువులో కాలకృత్యాలు, స్నానం చేయుటకై రమేష్ చెరువులో దూకగగా మెట్లపై నుండి కాలు జారి చెరువు నీటిలో ఈత రాక మునిగి చనిపోయాడన్నారు. మృతుడి తండ్రి నాగనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

కరెంట్ టవర్‌ను ఢీకొన్న డీసీఎం

● త్రుటిలో తప్పిన ప్రాణపాయం

బోధన్‌రూరల్,మార్చి23(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రం సమీపంలో ఆదివారం బోధన్ నుంచి మహరాష్ట్ర వైపు వెళ్తున్న డీసీఎం వాహనం ఎలక్ట్రికల్ టవర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గాయాలపాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డీసీఎం వేగంగా ఢీకొనడం వల్ల ఎలక్ట్రికల్ టవర్ విరిగిందని ఎస్సై తెలిపారు.

సమ్మక్క సారక్క విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ బోధన్ వాసి



వైస్ చాన్స్‌లర్‌ను అభినందిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మార్చి23(ఆంధ్రజ్యోతి): సమ్మక్క, సారక్క కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ తొలి వైస్ చాన్స్‌లర్‌గా బోధన్ పట్టణానికి చెందిన శ్రీనివాస్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము నియమించడం అభినందనీయమని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం బోధన్‌కు వచ్చిన ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైస్ చాన్సలర్‌గా నియమితులైన వైఎల్ శ్రీనివాస్ ఐదు సంవత్సరాలు కొనసాగుతారన్నారు. బోధన్ పట్టణానికి చెందిన వై శ్రీనివాస్ సమ్మక్క, సారక్క కేంద్రీయ విశ్వవిద్యాలయానికి తొలి వైస్ చాన్సలర్ కావడం బోధన్ పట్టణానికి ఎంతో గర్వకారణమన్నారు. శ్రీనివాస్ తన చిన్నతనంలో బోధన్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు తదితరులున్నారు.

హనుమాన్ స్వాములకు ఇఫ్తార్ విందు

వర్ని,మార్చి23(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో ఆదివారం హనుమాన్ స్వాములకు ముస్లింలు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. వివిధ రకాల పండ్లు అందజేసి ప్రార్థనలు చేశారు. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పవిత్ర మాసం అని ముస్లిం సోదరులు పేర్కొన్నారు. ముస్లిం సోదరులకు హనుమాన్ స్వాములు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం



నూతన విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

ఆర్మూర్‌రూరల్ మార్చి23(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్,కొటార్మూర్ విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెర్కిట్‌లోని సంఘ భవనంలో సమావేశమై నిర్వహించిన ఎన్నికల్లో సంఘం నూతన అధ్యక్షునిగా నూనె నరేష్, ప్రధానకార్యదర్శి మంచిర్యాల సుబాష్‌చందర్, గౌరవ అధ్యక్షుడిగా కొండ బుచ్చన్న, ఉపాధ్యక్షుడిగా సతీష్, వేల్పూర్ శ్రీనివాస్, కోశాధికారిగా ఓల్కాజీ సంతోష్, సహాయ కోశాధికారిగా వేల్పూల లక్ష్మీనారాయణను ఎన్నుకున్నట్టు సంఘ సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు ఈఉగాది పర్వదినం నుంచి ఏడాది కాలం పాటు బాధ్యతలు చేపట్టానున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమరవాజి చక్రదర్, పడ కంటి గంగాధర్, మంచిర్యాల సురేష్, సుంకం గణేష్, గంగాధర్, ప్రభాకర్, వెంకటేశం, లక్ష్మీనారాయణ, సంతోష్, సుదర్శన్,మోహన్,అశోక్ పాల్గొన్నారు.

వేల్పూర్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేల్పూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

● 50 ఏళ్ల తర్వత ఒక చోట కలిసిన పూర్వవిద్యార్థులు

వేల్పూర్, మార్చి23(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1976-77 విద్యసంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థుల 50ఏళ్ల తర్వాత ఒకచోట చేరిగెట్టుగేదర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఆయా ప్రాంతాలో వివిధ వృత్తులు,వ్యాపా రాలు,ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరుపుకున్నారు. అనంతరం అనాటి తరగతి గదుల్లో చేసిన చిలిపి చేష్టలు, అల్లర్లు, వివిధ పాఠాలు బోధించే ఉపాధ్యా యులపై వేసుకున్న జోకులు, ఇతర మధురస్మృతులను గుర్తు చేసు కున్నా రు.అనంతరం కుటుంబసభ్యులతో కలిసి ఉల్లాసంగా సహపంక్తి భోజనం చేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముప్కాల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ముప్కాల్,మార్చి23(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983- 84 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. విద్యబుద్దుల నేర్పిన ఉపాధ్యాయులైన తిరుపతిరెడ్డి, పుష్పనాథ్‌రెడ్డి, ఉమమహేశ్వర్‌రెడ్డి, అంజయ్య, ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఆయా ప్రాంతాలో వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని ఆత్మీయ సమ్మేళన కార్య క్రమం జరుపుకున్నారు. అనంతరం అనాటి తరగతి గదుల్లో చేసిన చిలిపి చేష్టలు, అల్లర్లు, ఇతర మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్ర మంలో ఎంఈవో బట్టు రాజేశ్వర్, మోట నర్సయ్య, వరంగంటి రమేష్, బ్రహ్మదండి చిన్నయ్య, దేవేగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా

● చికిత్స పొందుతూ ఒకరి మృతి



మృతి చెందిన సందుల చిన్నోల్ల సాయిలు

నందిపేట,మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడమ్మ కొండూర్ శివారులో గేదెను తప్పించబోయి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ప్రక్కనే ఉన్న గుంతలో పడడంతో సందుల చిన్నోల్ల సాయిలు(51) అనే రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన సందుల చిన్నోల్ల సాయిలు అనే రైతు నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పంచ గుడి గ్రామ శివారులో కౌలు చేస్తున్నాడు. ఆదివారం వరి కోతలో భాగంగా టార్పాలిన్లను ట్రాక్టర్‌లో వేసుకొని వెలుతుండగా మండలంలోని చౌడమ్మ కొండూర్ శివారులో గేదెను తప్పించబోగ ఆ ట్రాక్టర్ ప్రక్కనే ఉన్న పెద్ద గుంతలో పడింది. దింతో సాయిలుకు తీవ్ర గాయాలైనాయి. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానిని తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందు తూ మృతి చెందాడు. మృతుని భార్య సందుల విజయ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం చిరంజీవి తెలిపారు.

మున్సిపల్ ఆదాయానికి గండి

● తైబజార్ డబ్బులు చెల్లించని కాంట్రాక్టర్‌లు
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఆర్మూర్‌టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం మున్సిపల్ పరిధిలోని పట్టణంతో పాటు మామిడిపల్లి, పెర్కిట్, కొటార్మూర్ గ్రామాలకు తైబజార్‌ను వేలం పాట మున్సిపల్ అధికారులు నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం ఏప్రిల్‌లో ప్రారంభమైన తైబజార్ వేలం పాట వచ్చే ఏడాది మార్చికు ముగుస్తుంది. గత కొన్నేళ్లుగా వేలం పాట పాడి వేలాన్ని దక్కించుకుంటున్న కాంట్రాక్టర్‌లు మున్సిపల్‌కు సక్రమంగా డబ్బులు చెల్లించడంలేదు. వారం రోజుల్లో తైబజార్ కాంట్రాక్టు ముగియనుంది. మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి నిమ్మకుండిపోతున్నారు ఎందుకోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మూడు విడతల్లో చెల్లించాల్సిన తైబజార్ డబ్బులు కాంట్రాక్టర్ చెల్లించకపోతే రెవెన్యూ చట్టం ద్వారా బకాయిలను వసూలు చేయవచ్చు. అయినను మున్సిపల్ రెవెన్యూ విభాగం కమిషనర్ ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చి తదుపరి పరిణామలు ఎందుకు చేపట్టడం లేదో అర్థం కావడం లేదు. గడిచిన ఐదేళ్లలో సుమారు రూ.30లక్షలకు పైగా బకాయిలు ఉన్న వసూలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మున్సిపల్‌కు వచ్చిన కమిషనర్‌లు తైబజార్ కాంట్రాక్టర్‌లకు నోటీసులు ఇచ్చి వెళ్తున్నారే తప్ప వసూలు చేసి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలనే ఆలోచన ఎందుకు రావడం లేదో అందులో ఏమైనా అమ్యామ్యలు ముడుతున్నాయా, ఎప్పుడు కట్టిన బకాయి ఉన్న డబ్బునే కట్టాల్సి ఉంటుందని కాంట్రాక్టర్‌లు కాలాన్ని వెల్లదీస్తున్నారో తెలియడంలేదు. ఒక సంవత్సరం ఇంటి పన్ను కట్టక పోతే ఇంటి యజమానికి వడ్డీ పడుతుంది. కానీ కొన్ని నెలలు, సంవత్సరాలు గడిచినా వీరికి ఏలాంటి ఫైన్ వేస్తారో, అస్సలు వసూలు చేస్తారో వేచి చూడాలి. ఇంటి పన్నును రెండేళ్లుగా బకాయి ఉంటే ఇంటి వద్ద వార్డు ఆఫీసర్‌లు నిరసన తెలుపుతూ సీజ్‌లు చేస్తూ ముక్కుపిండి వసూలు చేస్తున్నా మున్సిపల్ అధికారులు అధిక మొత్తంలో రావల్సిన తైబజార్ బకాయి డబ్బును ఎందుకు వసూలు చేయడంలేదో అంతర్యమే మిటో అర్థం కావడంలేదు.



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం

ఐదేళ్లుగా తైబజార్ బకాయిలు

గడిచిన 2020- 21 సంవత్సరానికి షఫీ అనే వ్యక్తి తైబజార్ వేలం పాటను దక్కించుకున్నారు. కాగా వేలం పాట ముగిసిన మున్సిపల్‌పై సుమారు రూ.ఒక లక్ష బకాయి ఉన్నట్టు తెలిసింది. అలాగే 2022-23 సంవత్సరానికి శివ అనే వ్యక్తి రూ.20లక్షల 15వేల వేలం పాటను దక్కించుకోగా ఇంక రూ.10లక్షల 15వేల మున్సిపాలిటికి బకాయిలు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గూడ్స్ వాహనాలకు తైబజార్‌ను వసూలు చేయవద్దని, జీవో జారీ చేయడంతో వేలం పాటలో నష్టపోయానని మున్సిపల్ అధికారులకు విన్నవించుకోగా మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్‌కు కట్టాల్సిన రూ.10లక్షల 15వేలను మాఫీ చేసినట్టు తీర్మానించారు. ఉన్నతాధికారులు ఆమోదించకపోవడంతో శివ కోర్టును ఆశ్రయించినట్టు తెలిసింది. అలాగే 2023- 24 సంవత్సరానికి రూ.25లక్షల 30వేలకు రమేష్ అనే వ్యక్తి వేలం పాటను దక్కించుకున్నారు. అలాగే అప్పటి పరిస్థితుల్లో రెండు నెలలు వేలం పాటను రాష్ట్ర ప్రభుత్వం పొడగించడంతో రూ.లక్ష 30వేలు అదనంగా కట్టాల్సి ఉండగా ప్రస్తుతం రూ.5లక్షల 63వేల బకాయి ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుత సంవత్సరం 2024 -25 సంవత్సరానికి గాను రూ.28 లక్షల 86వేలకు సురేష్ అనే వ్యక్తి తొమ్మిది నెలల కొరకు వేలం పాటను దక్కించుకోగా ప్రస్తుతం రూ.15లక్షల 24వేలు మున్సిపాలిటీకి బకాయి ఉన్నారు.

స్థానిక కౌన్సిలర్‌ల అండదండలతో బకాయిలు

గడిచిన కొన్నేళ్ళలో తైబజార్ వేలం పాటను దక్కించుకుంటున్నా నాయకులు ఏదో ఒక కౌన్సిలర్‌కు బంధువై ఉండడం కొసమెరుపు. బకాయి ఉన్న నలుగురిలో ముగ్గురు స్థానిక కౌన్సిలర్‌కు దగ్గర బంధువులు. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అధికారం అండ ఉందని, బకాయిలు కట్టకుండా కాలాన్ని వెల్లదీస్తున్నారు. ఇప్పుడైనా ఉన్నతాధికారులు బకాయిలను వసూలు చేస్తారో లేదో ప్రజలు వేచిచూస్తున్నారు.

బకాయిలు వసూలు చేసి అభివృద్ధికి తోడ్పడాలి

● గుగూలోత్ తిరుపతినాయక్, మామిడిపల్లి



కొన్నేళ్లుగా మున్సిపాలిటీ తైబజార్ బకాయిలను తక్షణమే వసూలు చేసి వార్డులను అభివృద్ధి పర్చాలి. బకాయి పడ్డ కుటుంబ సభ్యులను తైబజార్ వేలం పాటలో పాల్గొనకుండా చర్యలు చేపట్టాలి.

నోటీసులు జారీ చేశాం

● రాజు, మున్సిపల్ కమిషనర్



మున్సిపల్‌కు తైబజార్ డబ్బులు బకాయి పడ్డ ఇద్దరికి నోటీలను జారీ చేశాం. స్పందించకుంటే రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం ఆస్తులను జప్తు చేస్తాం.

ఫటా..ఫట్...

ఎస్సైల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన

● సంపత్‌కుమార్, సీఐ, భిక్కనూర్



భిక్కనూర్ సర్కిల్ పరిధిలోని దోమకొండ, రాజంపేట, బీబీపేట, భిక్కనూర్ మండలాల్లో గల అన్ని గ్రామాల్లో ఆయా మండల ఎస్సైల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని భిక్కనూర్ సీఐ సంపత్‌కుమార్ అన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: మీ సర్కిల్ పరిధిలో ఎన్ని పోలీసు స్టేషన్‌లు ఉన్నాయి?

సీఐ: భిక్కనూర్ సర్కిల్ పరిధిలో దోమకొండ, భిక్కనూర్, బీబీపేట, రాజంపేట నాలుగు పోలీసు స్టేషన్‌లు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: అన్ని మండలాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: మండల పరిధిలో గల గ్రామాల్లో ఎస్సైలు ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామాల్లో ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారా?

సీఐ: ప్రతీ మండలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కడ ఎక్కువగా జరుగుతున్నాయో అక్కడ గుర్తించి ప్రమాదాలు జరుగకుండా సంబంధిత శాఖ అధికారులతో కలసి ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపడుతున్నాం. దోమకొండ మండలంలో అంచనూర్ వద్ద స్పీడ్ బ్రెకర్లు, సంగమేశ్వర్ ఎడ్ల కట్ట వాగు వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: మత్తు పదార్థాల పట్ల ఎలాంటి జగ్రాత్తలు పాటిస్తున్నారు?

సీఐ: ముఖ్యంగా యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నాము. ఇటీవలే సర్కిల్ పరిధిలో కొంత మందిని పట్టుకోవడం జరిగింది. మత్తు పదార్థాల నియంత్రణకు నాలుగు మండలాల పరిధిలో పోలీసు కానిస్టేబుళ్లతో నిఘాను పటిష్టం చేశాం.

ఆంధ్రజ్యోతి: యువతకు మీరిచ్చే సందేశం?

సీఐ: యువకులు ఉన్నత చదువులు చదివి జీవితంలో మంచి స్థాయిలో నిలవాలి. చేడు అలవాట్లకు దూరంగా ఉండాలి.మద్యం సేవించి వాహనాలు నడపొద్దు. ఓవర్‌స్పీడ్, త్రీబుల్ రెండింగ్ వెళ్లకూడదు.నిబంధనలు పాటించకుంటే చట్టరీత్యా కేసులు నమోదు చేయడం జరుగుతుంది. పోలీసు కేసులోక్లి వెళ్లకుండా మంచి నడవడికను నేర్చుకోవాలి.

● (ఆంధ్రజ్యోతి, దోమకొండ)

టీయూ విద్యార్థికి సాహిత్య పురస్కారం



టీయూ విద్యార్థికి సురవరం ప్రతాపరెడ్డి పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

డిచ్‌పల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వెన్నెల సాహితి సంగమం ఆధ్వర్యంలో సిద్దిపేటలో జరిగిన శ్రీ విశ్వావసు నామసంవత్సర ఉగాది కవి సమ్మేళనంలో ఆదివారం టీయూ విద్యార్థి రైటర్ రాజుకు సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య పురస్కారం అందుకున్నారు. రాజు రచించిన ఉగాది పండగ కవిత రచనను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు రాజును అభినందిస్తు ప్రత్యేకంగా సన్మానం చేశారు. సాహిత్యం అందుకున్న రాజుకు కవులు, రచయితలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

టీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో షహీద్ దివస్



టీయూలో షహీద్ దివస్‌లో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు

డిచ్‌పల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో షహీద్ దివాస్ సందర్భంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ చిత్ర పటాలకు ఆదివారం నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ మాట్లాడుతూ... 1931 మార్చి 23న ఈ భూమి కోసం భరత మాత కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలు తృణ ప్రాయంగా చిరునవ్వు తో ఉరి కంభాన్ని ఎక్కిన మహానీయుల త్యాగం మరువలేనిదని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి నాయకులు సమీర్, నవీన్, ఆశోక్, రాము, నరేందర్, పృథ్వి, వినోద్, మనోజ్, దిగంబర్, సంతోశ్ , శ్రీకాంత్, సాయికుమార్, శివ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న ముస్లింల దీక్షలు


మసీద్‌లో తరావీ నమాజ్ చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం పవిత్రతకు ప్రతీక, ఈ మాసంలో మానవాళికి మార్గదర్శిగా అవతరించిన పవిత్ర ఖురాన్ గ్రంథ పారాయణం ఎంతగానో ఉపకరిస్తుంది. ఇదే సందర్భంగా పాటించే కఠిన ఉపవాస దీక్షలు మానవులకు ఆత్మనిగ్రహం కలిగిస్తాయి. అనుచిత ఆలోచనలు పనుల నుంచి ఎవరిని వారు రక్షించుకునేలా చేస్తాయి. ఈ మాసంలో పొందే ఆరాధన సంబంధిత ఆనందాలు అనేకం.

● ఐదుసార్లు నమాజ్

దైనందిని కార్యక్రమాలకు అనుగుణంగా ప్రతీరోజు మిగిలిన సమయాల్లో నమాజ్‌లు నిర్దేశితమయ్యాయి. ఫజర్, జొహర్, అసర్, మగరిబ్, ఇషాగా విభజించారు. వీటిని రకాత్‌లుగా చేస్తుంటారు. రెండు సజ్దాలు పూర్తయితే ఒక రకాత్ పూర్తవుతుంది. అదేవిధంగా ఫజర్-2, జొహర్-4, అసర్-4, మగరిబ్-3, ఇషా-4, రకాత్‌లు ఫర్జ్ దైవాజ్ఞ మేరకు ముస్లింలు ఆచరిస్తారు. మహ్మద్ ప్రవక్త తన నమాజ్‌ల సందర్భంగా ఆచరించిన విధానాన్ని సున్నత్, నఫీల్ నమాజ్‌లు చదవడం సంప్రదాయం,

● 70 రేట్లు అధిక పుణ్యఫలం

పవిత్ర రంజాన్ మాసంలో చదివే ప్రతి నమాజ్‌కు 70రేట్ల అధిక పుణ్యఫలం లభిస్తుందని ముస్లిం విశ్వాసం, అందుకే అత్యధికులు మసీద్‌లకు తరలివస్తారు. రాత్రి ఇషా నమాజ్ తర్వాత తరావీ నమాజ్‌లో ఖురాన్ పఠిస్తారు. ఇందులో పారా(విభాగాలను) 27రోజుల్లో పూర్తి చేస్తారు. ప్రత్యేక తరావీ నమాజ్‌లో 20రకాత్‌లు ఆచరిస్తారు.

● రంజాన్ ప్రత్యేకం తరావీ..

రంజాన్ మాసంలో ప్రతీ రోజు ఐదు వేళల పాటించే నమాజ్‌తో పాటు ప్రత్యేకంగా తరావీ నమాజ్‌ను ఆచరిస్తారు. ప్రతిరోజు రాత్రి ఇషా నమాజ్ అనంతరం ఈ తరావీ నమాజ్ పాటిస్తారు. ఈ నమాజ్‌లో ఖురాన్ పఠనం, వినడం ఉంటాయి, దీనిని రంజాన్ చంద్రవంక దర్శనం నుంచి ఆరంభించి షవ్వల్ చంద్ర దర్శనంతో ముగిస్తారు. తరావీ నమాజ్‌లో హఫెజ్-ఎ-ఖురాన్ కంఠస్థం చేసిన వ్యక్తి ఖురాన్‌ను విపిపిస్తారు.

వైభవంగా ఇందూరు తిరుమల వేంకటేశ్వర కల్యాణం



కల్యాణోత్సవంలో నృత్యం చేస్తున్న దిల్‌రాజు దంపతులు, పాల్గొన్న భక్తులు

మోపాల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల, వేద మంత్రోశ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణలతో ఇందూరు తిరుమల వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవ విగ్రహాలను ఉంచి వేదోక్తంగా కల్యాణ తంతును అర్చకులు రోహిత్ ఆచార్య విజయ్‌ఆచార్య, అనిల్ ఆచార్యులు కళ్యాణం జరిపారు. కల్యాణంలోని ముఖ్య ఘట్టాలైన యజ్ఞోపవిత ధారణ, మధు పర్కాం, జీలకర్ర బెల్లం మాంగల్యసూత్రధారణ, తలంబ్రాలు, మాల పరివర్తన తంతును అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఓడి బియ్యం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవనాథ జీయర్‌స్వామి, గంగోత్రి రామానుజదాస్‌స్వామి, ఆలయ చైర్మన్ నర్సింహారెడ్డి, వేద పండితుడు శిఖామణి ఆచార్య, ఆలయ ధర్మకర్త దిల్‌రాజు, సినీ నిర్మాత, శిరీష్, శతమానం భవతి దర్శకుడు సతీష్ విఘ్నేష్, రచయిత చిన్నికృష్ణ, బలగం ఫైన్‌మధు, ఓదేల ఫేమ్ సురేందర్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వంతెనలు

● ప్రమాదపుటంచున ప్రయాణం ● ఇరుకు వంతెనలతో ఇబ్బందులు


శిథిలావస్థకు చేరిన ఫత్తేపూర్ శివారులోని ఇరుకు వంతెన


దేగాం - మంథని గ్రామాల మధ్య వాగుపై లోలెవల్ వంతెన


ఆలూర్ - గుత్ప గ్రామాల మధ్య లోలెవల్ వంతెన

ఆర్మూర్‌రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పలు గ్రామాల్లో లోలెవల్ వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. సుమారు 30ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన స్థలంలో నూతన వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఆలూర్, గుత్ప గ్రామాల మధ్య లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన ఇరువైపుల నీటి కాల్వ లోతుగా ఉండడంతో రాత్రి వేళల్లో ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఏ కొద్దిగా అజాగ్రత్తగా ఉన్న భారీ మూల్యం చెల్లించక తప్పదు. దీనికి తోడు ఆ ప్రాంతంలో మూలమలుపు ఉండడంతో వాహనదారులకు కష్టంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలతో రోడ్డు నిత్యం బీజీగా ఉంటుంది. శిథిలావస్థకు చేరిన వంతెన కాకుండా ఈ మార్గంలో ప్రమాద కరంగా మూల మలుపులు ఉన్నాయి. ప్రజల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరుకు వంతెనతో ఇబ్బందులు

ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామశివారులో ఇరుకు వంతెనతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. 44వ జాతీయ రహదారి నుంచి ఫత్తేపూర్, సుర్బిర్యాల్ మీదుగా కోమన్‌పల్లి వరకు ఇటీవల బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చారు. ఫత్తేపూర్ శివారులో వంతెన శిథిలావస్థకు చేరడమే గాకుండా ఇరుకుగా ఉండడంతో కొత్త వంతెన నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించారు. రూ.11కోట్లు వెచ్చించి బీటీరోడ్డు నిర్మించినప్పటికీ వంతెనకు మాత్రం నిధులు మంజూరు చేయలేదు. ఇరుకు వంతెన మూలంగా గతంలో పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై ఆసుపత్రుల పాలయ్యారు. ప్రమాదకరంగా మారిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా దేగాం, మంథని గ్రామాల మధ్య వంతెన

మండలంలోని దేగాం, మంథని గ్రామాల మధ్య వాగుపై లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలు కురిసే సమయంలో రోడ్డుపై నుంచి వర్షపు నీరు ప్రవహించి రాకపోకలకు అటంకం ఏర్పడుతుంది. వాగుపై నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలుమార్లు గ్రామస్థులు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా శ్రమదానం

● యంత్రాలతో పిచ్చి మొక్కలు, మట్టి తొలగింపు ● పీఏసీఎస్ మాజీ చైర్మెన్‌పై ప్రశంసల జల్లు


కొత్తపల్లి శివారులో పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగిస్తున్న పీఏసీఎస్ మాజీ చైర్మెన్ లక్ష్మీనారాయణ


మల్లారం శివారులో చదును చేయిస్తున్న దృశ్యం

నందిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం మల్లారం శివారు మీదుగా ఐలాపూర్ వరకు అలాగే ఐలాపూర్ నుంచి కంఠం క్రాస్ రోడ్డు మీదుగా మాక్లూర్ మండలం కొత్తపల్లి శివారు వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. మట్టి కుప్పలు పెట్టాయి. రోడుకు ఇరువైపుల నాటిని మొక్కలు చెట్లుగా మారి వాటి కొమ్మలు రోడ్లపైకి వచ్చాయి. దింతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి స్పందించిన ఐలాపూర్ గ్రామస్థుడు, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ మీసాల లక్ష్మీనారాయణ రెండు రోజులుగా యంత్రాలతో శ్రమదానం చేయిస్తున్నారు. గ్రామ అభివృద్దిలో భాగంగా మల్లారం శివారు నుంచి ఐలాపూర్, కంఠం క్రాస్ రోడ్డు మీదుగా మాక్లూర్ మండలం కొత్తపల్లి శివారు వరకు బ్లేడు ట్రాక్టర్‌తో రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలు తొలగించి, మట్టి దిబ్బలను చదును చేయించారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా పెంచిన మొక్కలు మహ వృక్షాలుగా పెరిగి వాటి కొమ్మలు రోడ్లపైకా రావడంతో ఎక్స్‌క వేటర్ (జేసీబీ)తో కట్ చేయించారు. సొంత ఖర్చులతో రెండు రోజులుగా యంత్రాలతో శ్రమదానం చేయిస్తున్న పీఏసీఎస్ మాజీ చైర్మెన్ మీసాల లక్ష్మీనారాయణపై పలు గ్రామాల ప్రజలు ప్రశంసల జల్లు కురిస్తున్నారు.


చౌడమ్మ కొండూర్‌లో పూజలు చేస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

పాప పుణ్యాలపైనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది

● జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి

నందిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మానవ జన్మలో మనుషులు చేసుకున్న పాప, పుణ్యాలపై భవిష్యత్తు ఆధారపడి ఉంటాయని శ్రీ జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామీ వెల్లడించారు. ఆదివారం నందిపేట మండలంలోని చైడమ్మ కొండూర్‌లో నూతనంగా నిర్మించిన చాముండేశ్వరీ ఆలయం ఆయన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 41 రోజుల అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో మండలి పూజ చేయించారు. ఈ సందర్భంగా శ్రీ జగద్గురు శంకరాచార్య హంపీవిరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామీ మాట్లాడుతూ భారత దేశంలో హిందూవులుగా జన్మించడం అదృష్టంగా భావించాలని వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీ జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామీ భక్తులకు ప్రవచనాలు చేశారు. ప్రపంచంలోనే భారత దేశ సాంస్కృతి గొప్పదని తెలిపారు. విజ్ఞానంతో కూడిన పనులు చేస్తే మనస్సాశాంతి లభిస్తుందన్నారు. సెల్‌ఫోన్ చార్జీతో ఎంత శక్తి వస్తుందో, దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో చేసిన మంత్రాలతో ఆలయాలకు అంతే శక్తి లభిస్తుందని చెప్పారు. పూర్వ జన్మలో చేసిన పాపాలే నేడు రోగాల రూపంలో వస్తున్నాయని, ఆచారాలు సాంప్రదాయాలు పాటించినప్పుడే ఫలితం దక్కుతుందని విద్యారణ్య భారతీ స్వామీ చెప్పారు. గంగా జలం పవిత్రతను గురించి ఆయన భక్తులకు ఉదాహరణలతో వివరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమంతుడి పడిపూజ

నిజామాబాద్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):హనుమంతుడి భక్తుల హనుమత్‌నామస్మరణతో పడి పూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని దత్తాత్రేయ ఆలయంలో వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం బ్రహ్మపురి శాఖ ఆధ్వర్యంలో హనుమాన్‌దీక్ష స్వాముల చే పడి పూజను శాస్త్రోత్తంగా జరిపారు. హనుమాన్ విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించి 108 నామాలతో ఆకుపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నుడా చైర్మన్ కేశవేణు హాజరయి మాట్లాడుతూ ప్రతీయేటా హన్మాన్ దీక్ష తీసుకునే వారి సంఖ్య పెరుగడం ఖఠిన నియమాలతో పూజించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ధన్‌పాల్ శ్రీనివాస్, రమేష్, వీరేందర్, ప్రసాద్, అల్లాడి రాజు, సతీష్, ఓంరాజు, తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

సేవాలాల్ మహరాజ్ మార్గం సదా అనుసరించాలి


ఉత్సవాలలో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే

పిట్లం,మార్చి 23 (ఆంధ్రజ్యోతి):బంజారుల ఆరాధ్య దైవం సంత్ సేవా లాల్ మహరాజ్ సమాజహితం కోసం ఆయన చూపినమార్గం సదా అనుసరీయ మని వారి జీవిత సందేశాలు సమాజానికి మార్గదర్శంగా ఉంటాయని ఆయ న బోధనలు ఆదివాసి గిరిజనుల సమాజ అభ్యున్నతికి తోడ్పడటమే కాక సమానత్వానికి ప్రాధాన్యతనిచ్చాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ అన్నారు. ఆదివారం సాయిగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో శ్రీసంత్‌సేవాలాల్ మహరాజ్ 286వ జయంతీ వేడుకలలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ బోధనలను సమాజంలోకి తీపుకెళ్లడంతో పాటు మనవంతుగా వాటిని పాటించడానికి కృషి చేద్దాం అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంజార అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.అదే విధంగా బంజార సోదరుల కోరిక మేరకు జుక్కల్ నియోజకవర్గంలో బంజార భవన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మనోజ్ కుమార్, నాయకులు రాంరెడ్డి,మొహన్‌రెడ్డి, బాబుసింగ్, రవి, బంజార నాయకులు పాల్గొన్నారు.

ఎకనామికల్,స్టాటికల్ సబార్డినల్ అసోసియేషన్ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న టీఎన్‌జీవోస్

కామారెడ్డిటౌన్,మార్చి 23(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఎకనామికల్,స్టాటికల్ సబర్డినల్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా టీఎన్‌జీవోస్ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు వ్యవహరించగా జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మన్,కార్యదర్శిగా రమేష్,కార్యవర్గ సభ్యు లను ఎన్నుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాలవెంకట్‌రెడ్డి మాట్లాడుతూతెలంగాణలో ఏసర్వే చేయాలన్నఎకనా మికల్, స్టాటికల్ వారుచేసినటువంటి సర్వే ఆధారంగానే అధ్యాయనం చేయ డం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్ర మంలో టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా సహధ్యక్షుడు చక్రధర్, ఉపాధ్యక్షుడు లక్ష్మన్ పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దకొడప్‌గల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో ఆదివారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలలో అంతర్గతంగా రోడ్ల నిర్మాణం కోసం ఉపాధి హామి నిధులు ద్వారా సీసీ రహదారి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాలను అభివృద్ధి చేయా లనే సంకల్పంతో తమ ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల ద్వారా పనులు చేయిస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద కొడప్‌గల్ మండలంలో సుమారు రూ.2 కోట్లకు పైగా ఉపాధి నిధులతో సీసీ రోడ్డు పంచాయతీ భవననిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. పనులను నాణ్యతగా చేయాలని సంబంధిత పనులు చేసే వారికి సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న కొడప్‌గల్ సహకార సంఘ వైస్ చైర్మన్ గంగా గౌడ్, కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్, చాంద్‌పాషా, రాంచందర్, శంకర్, అశోక్, మెగులాగౌడ్, మోహీద్దీన్, హన్మండ్లు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో తారు రోడ్డు పనులు ప్రారంభం


బీర్కూర్‌లో తారు రోడ్డు వేస్తున్న దృశ్యం

బీర్కూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో ఆదివారం తారు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. బీర్కూర్ మండల కేంద్రంలో తిమ్మాపూర్ రోడ్డు వద్ద కమాన్ నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు ప్రధాన రహదారిని నాలుగు పలకల రహదారిగా నిర్మించేందుకు గత రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు వెడల్పు చేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలను నిర్మించారు. అలాగే రహదారి మధ్యలో డివైడర్ నిర్మించారు. సెంట్రల్ లైటింగ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉండగా రహదారి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం తారు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. త్వరలో రహదారి పూర్తిస్థాయిలో అందుబాటు లోకి రానుంది. స్థానిక ప్రజలకు దుమ్మూ ధూళి సమస్య తీరనుంది.

మానవహక్కుల సహాయక సంఘం అధ్యక్షుడిగా మోసర్ల శ్రీకాంత్

సదాశివనగర్,మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా మానవహక్కుల సహాయక సంఘం జిల్లా అధ్యక్షుడిగా అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన మోసర్ల శ్రీకాంత్‌రెడ్డి నియామకం అయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర మానవహక్కుల సహాయకసంఘం చైర్మన్ సలీం ఉత్తర్వులు జారీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు ప్రజల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతానని తెలిపారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

కామారెడ్డిటౌన్,మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తు ఈనెల 25న నిర్వహించనున్న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని గ్రామపంచాయతి వర్కర్‌యూనియన్‌గౌరవఅధ్యక్షుడు వెంకట్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వమే వేతనాలు ఇస్తామని చెప్పి 15 నెలలు కావస్తున్న ఇప్పటికి పట్టించుకోవడం లేదని అన్నారు. చాలిచాలని వేతనంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు కావున కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని తెలిపారు. ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

దోమకొండలో చలివేంద్రం ప్రారంభం

దోమకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని గొట్టిముక్కుల చౌరస్తా వద్ద ఛత్రపతి శివాజీ సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం సేవాదళ్ అధ్యక్షుడు పన్యాల బాపురెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు నల్లపు శ్రీనివాస్, గజవాడ శ్రీకాంత్, బొమ్మెర శ్రీనివాస్, పాలకుర్తి శేఖర్, చింతల రాజేష్, మద్దూరి భూపాల్‌రెడ్డి, పన్యాల రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విరాళం

మాచారెడ్డి,మార్చి 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని చుక్కపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఆదివారం నర్మాలకు చెందిన తిరుపతిరావు, కవిత దంపతులు తమ కుమారుడి మొదటినెల వేతనం రూ.51016 విరా ళంగా అందించారు.అనంతరం దాతలను అర్చకులు సన్మానించి తీర్థప్రసా దాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయికి బానిసవుతున్న యువత

● అదుపు చేయకపోతే భవిష్యత్తు నాశనమే ● రోడ్డుపై వెళ్లాలంటే భయపడుతున్న ప్రజలు

గాంధారి,మార్చి23(ఆంధ్రజ్యోతి):గాంధారి మండల కేంద్రంతో పాటు మండలంలోని కొంతమంది యువత మత్తుకు బానిసవుతున్నారు. ప్రధానంగా డ్రగ్స్‌గంజాయిలకు బానిసై విచ్చలవిడిగా రోడ్లపై ప్రయాణాలు సాగుస్తూ ఇతరుల ప్రాణాలు హరిస్తున్నారు. అందుకు ప్రత్యేక ఉదాహరణ ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదమే. గాంధారి మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మరణానికి కారణమైన యువకుడు మత్తులో ఉండి విచక్షణ కోల్పోయి ఇష్టాను సారంగా వాహనం నడపడం తోనే అలాంటి సంఘటన చోటుచేసు కుంది. మండల కేంద్రంలోని యువత రోజురోజుకు మత్తుకు బానిస వుతుండడం ఇటీవల కానిస్టేబుల్ మృతికి కారణమైన యువకుడు గతంలోను ఓ రోడ్డు ప్రమాదానికి కారణ మవడంతో మరో యువకుడు బలయ్యాడు. రోడ్లపై విచ్చలవిడిగా మద్యం తాగి అర్ధరాత్రి వరకు వాహనాలు నడపుతూ ఇతరుల ప్రాణాలు తీస్తు న్నారని మండల వ్యాప్తంగా తీవ్ర చర్చకొనసాగుతుంది. రాత్రి,పగలు అని లేకుండారోడ్లపై ప్రయాణించాలంటే జంకే పరిస్థితులు ఎదురవు తున్నాయని వాపోతున్నారు. ఇటీవల మృతిచెందిన కానిస్టేబుల్ రవికి ముగ్గురు చిన్నపిల్లలు ఉండడంతో వారి ఆలనపాలన ఎవరుచూ సుకుం టారనేది ప్రశ్నర్థకంగా మారింది. యువత మత్తులో చేస్తున్న ప్రమా దాలతో మృతి చెందిన వారి కుటుంబాలు రోడ్డున పడుతు న్నాయి. గంజా యి సరాఫరాదారులు, వినియోగదారులపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంచి ఉక్కుపాదంతో అణిచివేస్తేనే మరో ప్రమాదం జరిగే అవకా శాలు ఉండవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కాటేపల్లిలో మైనారిటీలకు ఇఫ్తార్ విందు

పెద్ద కొడప్‌గల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ మైనారిటీలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ మాట్లాడుతూ.. గత కొద్ది సంవత్సరాలుగా తమ కుటుంబం ప్రతి సారి రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందును అందజేస్తున్నామని తెలిపారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు పవిత్రమైన ఉపవాస దీక్షలు ఉంటారని, ఈ సమయంలో తమ కుటుంబం ప్రతిసారి మైనారిటీ సోదరులకు ఇఫ్తార్ విందు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంత రం మైనారిటీ నాయ కులు ఇఫ్తార్ విందును అందజేసిన మల్లప్ప పటేల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు సయ్యద్ రసూల్, షఫీ పటేల్, మహబూబ్, ఫకీర్, శాదుల్, సమద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


మల్లప్ప పటేల్‌ను సన్మానిస్తున్న మైనారిటీలు

కవిత్వం సగటు మనిషికి బాసటగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్‌శిక్షక్

కామారెడ్డిటౌన్,మార్చి 23(ఆంధ్రజ్యోతి): కవిత్వం సగటు మనిషికి బాసటగా నిలవాలని సమస్యలను పరిష్కరించేమార్గంలో దిశానిర్ధేశం చేయాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్‌శిక్షక్ అన్నారు. ఆదివారం కామారెడ్డిలోని సీనియర్ సిటిజన్స్ ఫోరంలో నిర్వ హించిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాహిత్యం ఒక సృజనాత్మక ప్రక్రియతో కూడినదని కవులు,రచయితలు ఆలోచిం పజేసే కవిత్వాన్ని రాయాలని తెలిపారు. కామారెడ్డి సాహిత్యం ఎంతో మందికి దిక్సూచిలా నిలుస్తుందని యువ కవులను ప్రోత్సహించే దశలో తెలంగాణ రచయితల వేదిక ఎల్లప్పుడు ముందు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా శుక్రవారం సాయంత్రం ఐదుగంటలకు సీనియర్ సిటిజన్స్ ఫోరంలో తెరవే ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని పాల్గొన్న వా రందరికి ప్రశంసపత్రాలు అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖకవి రచయిత ఎన్నిశెట్టి గంగాప్రసాద్ రాసిన పద్య దర్శిని సమస్యపురణాల పుస్తకాన్ని కూడా ఆవి ష్కరించనున్నట్లు తలెఇపారు.ఈ సమావే శంలో కాసర్లరామచంద్రం,చంద్రకాంత్,గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ముట్టడి



ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న పాకజ్ఞానేశ్వరి

కామారెడ్డిటౌన్,మార్చి 23(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్రమహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టగా కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు పాకజ్ఞానేశ్వరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ కేంద్రప్రభుత్వం33 శాతం రిజర్వేషన్ బిల్లు పాస్‌చేసిన అమలుచేయకపోవడం దుర దృష్టక రమని తెలిపారు. బీజేపీ ప్రభుత్వంలో మహిళలపై అణిచివేత ఇంకెం తకాలమని, మహిళలకు పెద్ద పీట వేసింది కేవలం కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లు తక్షణమే అన్ని రంగాల్లో అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

సీనియర్ రోటరియన్లకు అవార్డుల ప్రధానం


అవార్డులు అందుకున్న సీనియర్ రోటరియన్‌లు

కామారెడ్డిటౌన్,మార్చి 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన రోటరి కాన్ఫరెన్స్ అలాయ్‌బలయ్ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ రోటరియన్లకు అవార్డులను ప్రధానం చేశారు. కామారెడ్డి రోటరి క్లబ్‌లో పలు అంశాల పట్ల అవగాహన కల్పించడంతో పాటు విశేష సేవలు అందించినందుకు గాను డాక్టర్ బెల్లం బాల్‌రాజు,ధనంజయ్,జగన్నాథం, కాశీనాథం,సుభాష్‌చంద్‌జైన్‌లు అవార్డులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో రోటరి ఎలెక్ట్ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి,ప్రెసిడెంట్ రాజనరసింహరెడ్డి, కృష్ణహరి,శంకర్,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు


రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

భిక్కనూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ నాగర్తి ప్రీతమ్‌ను భిక్కనూరు మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రీతమ్‌ను మండల నాయకులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ మేరకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తుడుం జీవన్ మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించడం జరిగింద న్నారు. అనంతరం జరిగిన జన్మదిన వేడుకల్లో పాల్గొని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయ్యడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ విభాగ అధ్యక్షుడిగా గైని శివాజీ


నియామక పత్రం అందుకుంటున్న గైని శివాజీ

తాడ్వాయి,మార్చి23(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ విభాగ అధ్యక్షునిగా గైని శివాజీని నియామకం అయ్యా రు. ఆదివారం ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు,ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతమ్,ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ కార్యక్రమంలో కా మారెడ్డి ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, తాడ్వాయి మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, గ్రామ వీడీసీ అధ్యక్షుడు మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలో జిల్లావాసులఉత్తమ ప్రతిభ

కామారెడ్డిటౌన్,మార్చి 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కొల్లూర్ గాడియం పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటిలలో జిల్లాకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనభరిచారని అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అనిల్ తెలిపారు. ఈశ్వర్ ప్రసాద్ అండర్ -20 విభాగంలో జావెలిన్‌లో సిల్వర్‌మెడల్, సునీత అండర్ -18 విభాగంలో 400మీటర్స్ రన్నింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు.ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు వారిని అభినందించారు.

దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

● కురుమ యువచైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహా
● పెద్దమల్లారెడ్డిలో దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ


దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం.

భిక్కనూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్యను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకో వాలని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్య క్షుడు నర్సింహా కురుమ అన్నారు. ఆదివారం భిక్క నూరు మండలంలోని పెద్ద మల్లారెడ్డిలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్ర హాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి కొ మురయ్య త్యాగం వెలకట్ట లేనదని కొని యాడారు. అంతకుముందు గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంజీవ్ కురుమ, వర్కింగ్ ప్రెసిండెంట్ మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోల్ల స్వామి, గ్రామ అధ్యక్షుడు చెట్కూరి భూపాల్, రవి, మహిపాల్,పోచయ్య,మల్లయ్యతదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో కారు చార్జింగ్ మిషన్



పెట్రోల్ పంప్‌లో ఏర్పాటు చేసిన చార్జింగ్ మిషన్

పెద్ద కొడప్‌గల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాను రాను సాంకేతిక పెరుగుతున్న కొద్ది వాహనాల రూపంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంలో పెట్రోల్, డీజిల్‌తో వాహనాలు నడిస్తే నేడు తక్కువ ఖర్చుతో,వాయు కాలుష్యం లేని వాహనాలు అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో మార్కెట్లో ఎక్కడ చూసిన ఎలక్ట్రికల్ కార్లు, ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో ప్రజలు తక్కువ ఖర్చుతో పాటు ఎటువంటి శబ్దం, కాలుష్యం వెలువడిని ఎలక్ట్రికల్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. గత కొద్ది రోజుల కిందట వరకు మండల కేంద్రాలలో ఒకటో, రెండో కనబడే చార్జింగ్ వాహనాలు నేడు పదుల సంఖ్యకు చేరుకున్నాయి. ఈ వాహనాలకు చార్జింగ్ అవసరం ఉండటంతో ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్దే చార్జింగ్ చేసుకుంటున్నారు. అయితే ఇంటి వద్ద ఒక కారుకు చార్జింగ్ చేయడానికి రెండు గంటలకు పైగా సమయం పడుతుందని వాహనదారులు పేర్కొంటున్నారు. దీంతో వాహనదారుల అవసరాలను గుర్తెరిగిన పెట్రోల్ సంస్థలు తమ కేంద్రాల వద్ద చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నాయి. రాష్ట్ర, జిల్లా కేంద్రాలలో మాత్రమే అందుబాటులో ఉండే చార్జింగ్ మిషన్లు నేడు మండల కేంద్రాలలో అందుబాటులోకి రానున్నాయి. ఇంటి వద్ద చార్జింగ్ చేయడానికి 2 గంటల పాటు సమయం పడుతుంటే, చార్జింగ్ పాయింట్ల వద్ద కేవలం అరగంటలో కారు ఫుల్ చార్జింగ్ అవుతుందని పెట్రోల్ పంపు నిర్వాహకులు తెలిపారు. ఒక కారు చార్జింగ్ చేయడానికి ఎంత చెల్లించాలనేది త్వరలో వెల్లడిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సిద్దరామేశ్వరనగర్ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న దృశ్యం

భిక్కనూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నార్సింపేట స్వామి, ఉపాధ్యక్షుడిగా బోయిని బలరాం, ప్రధాన కార్యదర్శిగా పుట్నాల శ్రీనివాస్, కోశాధికారిగా బోయిని సిద్ధరాములు ఎన్నికయ్యారు. అనంతరం గ్రామంలోని పెద్దమ్మఆల యంలో నూతనంగా ఎన్నికైనా పాలకరవర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశా రు. ఈ మేరకు నూతన అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ గ్రామంలో సంఘం అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు.ఈకార్యక్రమంలో సంఘంసభ్యులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత


ఫోన్ అందజేస్తున్న ఎస్సై

దోమకొండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దోమకొండ గ్రామానికి చెందిన పద్మ ఫోన్ పోయిందని ఫిర్యాదు ఇవ్వడంతో ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా పట్టుకుని బాధితురాలికి ఆదివారం పోలీసు స్టేషన్‌లో అందజేసినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోన్‌కు ఎదైన లింక్ వస్తే దానిని క్లిక్ చేయకూడదన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలని సూచించారు. మహిళలకు ఎదైన సమస్య ఉంటే నేరుగా తమకు తెలియజేయలన్నారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు టోల్ మినహాయింపు కల్పించాలి

భిక్కనూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు టోల్‌ప్లాజాలో మండలంలోని వాహనాలకు టోల్ వసూళ్లు చేయకుండా మినహాయింపు కల్పించాలి బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో భిక్కనూరు మండలంలోని అన్నిగ్రామాల వాహనాలకు మినహాయింపు ఉండేదని, ప్రస్తుతం భిక్కనూరు మండల వాహనాలకు టోల్ వసూళ్లు చేయ్యడం ఏమిటని ప్రశ్నించారు. భిక్కనూరు మండలంలోని అన్నిగ్రామాల వాహనాలకు ఇకపై టోల్ వసూళ్లు చేస్తే సహించేది లేదన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - ఫైర్
ప్రియా 70 - పెళ్లికాని ప్రసాద్
ప్రియా 35 - ఛావా

బాన్సువాడ

మహేశ్వరి - కోర్ట్
వెంకటేశ్వర - షణ్ముఖ

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

